నైతిక విలువలతోనే సంస్థల నిరంతర ప్రగతి

విశాలాంధ్ర - మధురవాడ: వర్తమాన హితమైన పారిశ్రామిక ప్రణాళికలు, సామాజిక బాధ్యత, నైతిక విలువలను పాటిస్తూ వ్యాపార నిర్వహణ ద్వారా సంస్థల నిరంతర ప్రగతిని సాధించగలవని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి యువజనోత్సవం జెస్ 2024లో భాగంగా గురువారం నిర్వహించిన సదస్సులో పారిశ్రామిక నిపుణులు అభిప్రాయపడ్డారు. జి.ఎస్.ఎస్.గ్రూప్ ఉపాధ్యక్షుడు ప్రదీప్ మాట్లాడుతూ కార్పొరేట్ రంగంలో ఉద్యోగస్తులకు సంస్థపై నమ్మకం పెంచేలా విధానాలు ఉండాలన్నారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ అపరేషన్స్ విభాగం అధిపతి శరవణన్, గోద్రేజ్ సంస్థ మార్కెటింగ్ విభాగం అధిపతి శివ, బైజ్యానిక పారిశ్రామిక వేత్త అలోక్ తదితరులు తమ ప్రసంగాలలో కార్పొరేట్ రంగంలో నిలదొక్కుకోవాలంటే అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. గీతం ఎక్సలెన్స్ మీట్ 2024 ముగింపు దినోత్సవంలో విజేతలకు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు బహుమతులు అందజేశారు.

గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించండి

విశాలాంధ్ర - చింతపల్లి: మమ్మల్ని మనుషులుగా గుర్తించి మా గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని బలపం పంచాయితీ శివారు గ్రామం జోహారు గ్రామ గిరిజనులు వేడుకుంటున్నారు. గురువారం వారు మాట్లాడుతూ తమ గ్రామంలో 70 కుటుంబాల గిరిజనులం నివసిస్తున్నామని, గడచిన 80 ఏళ్లుగా తరాలు మారుతున్న తమ తలరాతలు మారలేదన్నారు. ఎన్ని ప్రభుత్వాలు, ఎంతమంది పాలకులు, అధికారులు మారిన తమ గ్రామానికి కనీస మౌలిక వసతులు కల్పించడంలో వైఫల్యం చెందారన్నారు. స్వాతంత్య్రం వచ్చి

76 ఏళ్ల పూర్తిచేసుకుని సంబరాలు జరుపుకుంటున్న ప్రస్తుత రోజుల్లోనూ తమ గ్రామానికి కనీసం మౌలిక వసతులైన రహదారి, రవాణా సౌకర్యాలు లేవని వారు వాపోయారు. ఎన్నికల సమయంలో ఓట్లు కోసం వచ్చే నాయకులు గెలిచిన తర్వాత తమ గోడు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పాఠశాల భవన నిర్మాణం అసంపూర్తిగా మిగిలిందన్నారు. రోగులు, గర్భిణీలను ఆసుపత్రికి తీసుకువెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదన్నారు. ఇప్పటికైనా మారుమూల గ్రామాల అభివృద్ధి కోసం పాలకులు అధికారులు పనిచేయాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో కొర్ర రంగారావు, రాం బాబు, తీలు, వంతల నాగరాజు, వి.సన్యాసిరావు, కే.శివరావు, సిహెచ్ భాస్కరరావు పాల్గొన్నారు.

15న పీవీటీజీ గిరిజనులతో ముఖాముఖి

విశాలాంధ్ర - అరకులోయ: ఈనెల 15వ తేదీన జరగనున్న భారత ప్రధాన మంత్రి వివిటిజి గిరిజనులతో వర్చువల్ విధానంలో ముఖా ముఖి సంభాషిస్తారని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పి. యం. జన్‌మన్) పథకాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని చెప్పారు.

గురువారం మండలంలోని కొత్తభల్లుగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో అధికారులతో పి.యం. జన్ మన్ కార్యక్రమం నిర్వహణపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. వివిటిజి గిరిజనులందరికీ ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఆధార్ కార్డులు, ప్రధానమంత్రి జన్ మన్ గృహాలు మంజూరు, ప్రతి వివిటిజి గృహానికి విద్యుత్తు సదుపాయం ధృవీకరణ పత్రాలు సమర్పించాలని ఆదేశించారు. అనంతరం సభా స్థలిని అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి వి.ఎస్.ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు ఐ.కొండలరావు పాల్గొన్నారు.

జిల్లాలో 23,639 మందికి జగనన్నతోడు నిధులు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జగనన్న తోడు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 23,639 మంది చిరు వ్యాపారులు లబ్ధిపొందారు. వృత్తి కళాకారులతో సహా చిరు వ్యాపారులు, వీధి వ్యాపారుల ఆదాయాలను మరింత మెరుగుపరచేందుకు నిర్దేశించిన జగనన్నతోడు 8వ విడత నిధుల పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మీట నొక్కి నిధులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుండి జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లి ఖార్జున పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ప్రసంగం అనంతరం జిల్లాలోని అర్హులైన 23,639 మందికి రూ.60.72 లక్షల వడ్డీ రాయితీని, అదేవిధంగా 17,469 మందికి రూ.18.48 లక్షల కొత్త రుణాల నమూనా చెక్కులను ఎస్ఎల్ జి ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వి.పాపినాయుడుతో కలిసి కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర - పెదబయలు: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో గత 3, 4 నెలల నుండి శ్రామికులు / కూలీలు పలు రకాల పనులు పూర్తి చేశారని వారికి వెంటనే వేతనాలు చెల్లించాలని పలువురు కోరుతున్నారు. కనీసం సంక్రాంతి పండగ ముందైనా వేతనాలు ఖాతాల్లో జమచేస్తారని ఎంతో ఆసక్తితో ఉన్నామని అయినా ఫలితం కనిపించడం లేదన్నారు. తక్షణమే వేతనాలు చెల్లించాలని కోరారు.

31వ రోజుకు అంగన్వాడీల సమ్మె

విశాలాంధ్ర - పరవాడ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పరవాడలో అంగన్వాడీలు తలపెట్టిన సమ్మె గురువారం నాటికి 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షా

శిబిరంలో చెవిలో పువ్వులతో నిరసన తెలిపారు. నెల రోజులుగా రోడ్డెక్కి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం అన్యాయమని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్తులో సమ్మెను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు అక్కమ్మ, ఎం.రమణి, సిహెచ్.దేవి, ఈశ్వరమ్మ, సత్య, ఉమ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 31వ రోజు కొనసాగుతున్నా ప్రభుత్వంలో చలనం లేదని సిఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు అన్నారు. మండల కేంద్రంలో అంగన్వాడీల శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు.

ప్రభుత్వం చర్చించి సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ప్రాజెక్ట్ నాయకులు ఎం.మంగతాయారు, సిహెచ్.భ్రమరాంబ, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యువజన దినోత్సవం

విశాలాంధ్ర - మల్కాపురం: వికసిత భారత్ లక్ష్యంగా 2047కు భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా తయారు కావాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరిపారు. భారత దేశం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. సమావేశంలో జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయా దేవి, సావిత్రిబాయి పూలే అవార్డ్ గ్రహీత కుమారి వి.సునీత, వి.సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

ట్వింకిల్ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ట్వింకిల్ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు జరిగాయి. స్కూల్ నందు విద్యార్థులు రంగవల్లులు వేసి ఆనందోత్సాహంతో గడిపారు. తెలుగు సంప్రదాయ దుస్తుల ధరించి తెలుగువారి ఔన్నత్యాన్ని చాటిచెప్పారని ప్రిన్సిపాల్ బి.శాంతి అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో జీవీఎంసీకి 4వ స్థానం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: స్వచ్ఛ భారతే ధ్యేయంగా, ఆంధ్ర రాష్ట్ర అభివృద్దే లక్ష్యంగా పని చేసిన జీవీఎంసీకి జాతీయ స్థాయిలో 4వ పరిశుభ్ర నగర పురస్కారాన్ని దక్కించుకుంది. గురువారం ఢిల్లీలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాన్ని కేంద్ర గృహ, పట్టణ వ్యవహార శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి చేతుల మీదుగా రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ అందుకున్నారు. ఈ అత్యుత్తమ పురస్కార గౌరవాన్ని నగర ప్రజలకు అంకితం చేస్తూ, విశాఖ నగరానికి ఈ ఖ్యాతి కేవలం విశాఖ నగర ప్రజల సహకారంతోనే లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. 2023 స్వచ్ఛ సర్వే క్షణ్‌లో కూడా స్వచ్ఛ భారత్ మిషన్ రూపొం దించిన సర్వీస్ లెవెల్ ప్రోగ్రెస్ (4830 మార్కు లకు), సర్టిఫికేషన్ (2500 మార్కులకు), సిటిజెన్ వాయిస్ (2170 మార్కులకు) అంశాలకు సంబం ధించి 9500 మార్కులకుగాను విశాఖ పట్నం 8879.25 మార్కులను దక్కించుకొని, 4477 నగరాల మధ్య పోటీలలో, ఒక లక్ష కంటే ఎక్కువ జనాభా కలిగిన నగరాల జాబితాలో జాతీయ స్థాయిలో 4వ పరిశుభ్ర నగర స్థాయి పురస్కారాన్ని ప్రజల సహకారంతోనే విశాఖపట్నం పొందడం చాలా సంతోషంగా వుందన్నారు. ఈ జాతీయ స్థాయి ఖ్యాతికి నిత్యం సహకరిస్తున్న డిప్యూటీ మేయర్లకు, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు, వార్డు కార్పొరేటర్లకు కృతజ్ఞతలను తెలిపారు. ఈ పురస్కార సాధనలో నిత్యం విధులు నిర్వహించిన జీవీఎంసీ అన్ని విభాగాల ఉద్యోగులకు ముఖ్యంగా ప్రజారోగ్య విభాగం, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు, ముఖ్యంగా బాధ్యతాయుతంగా నిత్యం పారిశుధ్య సేవలు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఓఎస్డీ

విశాలాంధ్ర - చింతూరు: మారు మూల గిరిజన గ్రామాల్లో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని రంపచోడవరం ఓఎస్డీ మహేశ్వర్ రెడ్డి పేర్కొ న్నారు. గురువారం చింతూరు మండలంలోని తులసిపాక గ్రామంలో గిరిజన యువకులకు వాలీబాల్ క్రీడలు యువ హెల పేరుతో ప్రారంభించారు. మారుమూల గ్రామమైన మల్లంపేట, అల్లిగూడెం గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండగా పోలీస్ క్యాంపులో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశామని ఈ నీటిని ప్రతి ఒక్కరూ ఉచితంగా తీసుకెళ్లొచ్చునని అన్నారు. అలాగే భద్రాచలం నుండి ఈ నెలా ఖరులోగా ఆర్టీసీ బస్సును మల్లంపేట వరకు నడపటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం నేటికీ లేదని ఆయా గ్రామాల్లో ఒకేసారి విద్యుత్ సౌకర్యం కల్పించడం సాధ్యం కాదని, ప్రస్తుతం ఆరు గ్రామాలకు విద్యుత్ సౌకర్యం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఏఎస్పీ రాహుల్ మీనా మాట్లా డుతూ గిరిజన గ్రామాల్లో ఏమైనా సమ స్యలు ఉంటే తమ దృష్టికి గాని, డివిజనల్ స్థాయి, మండల స్థాయి అధికారులకు తెలపాలన్నారు. 40 జట్లు వాలీబాల్ పోటీల్లో పాల్గొనగా అల్లిగూడెం టీం మొదటి బహుమతి, రెండవ బహుమతి నారకొండ జట్లు పొందాయి. గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో 141 బెటాలియన్ కమాండెంట్ సురేష్ కుమార్, చింతూరు సీఐ గజేంద్ర కుమార్, రాజవొమ్మంగి సీఐ స్వామి నాయుడు, రంప చోడవరం సిఐ వెంకటేశ్వర్లు, చింతూరు ఎస్సై శ్రీనివాస్, మోతుగూడెం ఎస్ఐ గోపాల రావు, డొంకరాయి ఎస్ఐ శివకుమార్, సర్పంచ్ చంద్ర య్య, ఎంపీటీసీ నాగరాజు పాల్గొన్నారు.

విశాఖ తూర్పులో సిపిఐలో చేరికలు

విశాలాంధ్ర - విశాఖ: విశాఖ తూర్పు నియోజకవర్గంలో 15 కుటుంబాలు గురువారం మద్దిలపాలెం సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు పడాల గోవింద్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పడాల గోవింద్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల హక్కుల రక్షణ కోసం..., వారి సమస్యల పరిష్కారం కోసం..., దేశ సమైక్యత, సమగ్రత కోసం..., భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం దాదాపు వంద దేళ్లుగా రాజీలేని పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐ ది అని అన్నారు. పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానించారు. సిపిఐ ఆధ్వర్యంలో జరిగే పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్ మధు రెడ్డి, కె. రాజు, కె. భాగ్య, విజయ్ కుమార్, చిన్ను, షేక్ మదీనా వల్లి, నూర్జహీషాబేగం, బంగార్రాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఛాయా చిత్ర ప్రదర్శన

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దేశ ప్రజలందరికీ ఆదర్శనీయుడని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి శ్లాఘించారు. సామాజిక సమతా సంకల్ప కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ జీవిత చరిత్రపై స్థానిక ఎంపీడీవో మందిరంలో గురువారం ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అంబేద్కర్ జీవితంపై ఏర్పాటు చేసిన ఈ ఛాయా చిత్రాల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ ప్రారంభిం చారు. అంబేద్కర్ జననం, బాల్యం, విద్యా భ్యాసం, వివాహం, రాజ్యాంగ రచన, వివిధ ఘట్టాలకు సంబంధించిన ఛాయాచిత్రాలను ప్రద ర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 19న విజయవాడలో 125 అడుగుల విగ్రహం, అంబేద్కర్ సేవలకు ప్రతి రూపంగా నిర్మించిన స్మృతి వనాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో గ్రామ సచివా లయం, మండల, జిల్లా స్థాయిలో జన భాగిదారి కార్యక్రమం కింద అంబేద్కర్ చిత్రపటానికి నివాళు లర్పించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ డి.వరాహ సత్యవతి, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజుల వాణి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అజయ్ బాబు, అనకాపల్లి ఎంపీపీ గొర్లె సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను విధిగా తనిఖీ చేయాలి

విశాలాంధ్ర - హుకుంపేట: సెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రాలను విధిగా తనిఖీ చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ స్పష్టం చేశారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులు సంయుక్తంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలు, గతంలో జరిగిన పోలింగ్ సరళి, అవాంఛనీయ సం ఘటనలు జరిగితే నివేదించాలని సూచించారు. సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిపించవలసిన బాధ్యత సెక్టార్ అధికారులపైనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో ఎల్.రజని, పంచాయి తీ రాజ్ ఏఈ ఎస్.సంజీవరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రమేష్ బాబు, ఐసిడిఎస్ సిడిపిఓ బాల చంద్రమణి దేవి, ఎంఈఓ 1 చిట్టప్ప, ఎంఈఓ 2 కూడా ఈశ్వరరావు, అగ్రికల్చర్ ఆఫీసర్ లీలావతి, డిప్యూటీ సిహెచ్.కృష్ణారావు పాల్గొన్నారు.

డా. అంబేద్కర్ స్మృతి వనం పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విజయవాడ స్వరాజ్ మైదానంలో ఈ నెల 19న సామాజిక న్యాయ మహా శిల్పం డా. బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహ ఆవిష్కరణ జరుగనున్న సందర్భంగా 87వ వార్డు సచివాలయాల పరిధిలో వార్డు అడ్మిన్స్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో 87వ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, గాజువాక మండల క్లస్టర్-4 జేసీఎస్ ఇన్‌చార్జ్ వాడపల్లి రామచంద్ర రాజు, బొడ్డ గోవింద, కోమటి రమాదేవి, చిత్రాడ రమణ, సరవ రమణ, ఉప్పు శ్రీ రాములు, నబ్బనవరపు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల జనసేన మండల అధ్యక్షులుగా శివాజీ

విశాలాంధ్ర - వి. మాడుగుల: మాడుగుల జనసేన మండల అధ్యక్షుడిగా గట్రెడ్డి శివాజిని నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు పార్టీలో ఉంటూ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లడం జరిగిందన్నారు. పార్టీ చేస్తున్న అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని తన సొంత నిధులతో పార్టీకి సేవలు చేస్తున్నానని తెలిపారు. తనకు మండల

అధ్యక్షులుగా నియమించినందుకు అందరికు ధన్యవాదాలు తెలిపారు. శివాజీకి మండల అధ్యక్షుల పదవి ఇచ్చినందుకు జనసేన సీనియర్ నేత దాసరి అప్పారావు, అప్పలనాయుడు, రమేష్, నాగరాజు అభినందనలు తెలిపారు.

దారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో గంగధార వద్ద దారోత్సవాలు ఈఓ శ్రీనివాసమూర్తి సమక్షంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏటా గోదాదేవి కళ్యాణానికి ముందు ధారోత్సవాలు జరపడం ఆచారంగా వస్తోంది. స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్, జిల్లా టీడీపీ నాయకులు, కార్యకర్తలు దర్శించుకున్నారు.

జనసేన మండల అధ్యక్షుడిగా పప్పల శివ

విశాలాంధ్ర - యస్.రాయవరం: జనసేన పార్టీ మండల అధ్యక్షుడిగా పప్పల శివ నియమితులయ్యారు. మండలంలో అడ్డ రోడ్డు - తిమ్మాపురం గ్రామానికి చెందిన జన సైనికుడు శివను నియమించడంతో మండలంలోని జనసేన పార్టీ నాయకులు, జన సైనికులు, వీర మహిళలు అభినందలు తెలియజేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పార్టీ నిబంధనల ప్రకారం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

జనసేన మండలాధ్యక్షుడిగా భీమన్న

విశాలాంధ్ర - జి.మాడుగుల: జనసేన మండల అధ్యక్షుడిగా మసాడి భీమన్న ఎన్నికయ్యారు. రానున్న సాధారణ ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా పలువురు జనసేన నాయకులు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్, మసాడి సంపోలలం, సాగిన ఈశ్వరరావు, నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి శ్రీ ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీస్ కలిగొట్ల శ్రీరామ చంద్ర మూర్తి, కలిగొట్ల సూర్య నారాయణ మూర్తి, కలిగొట్ల భానోజీరావు, కలిగొట్ల శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు పురాణం శేషాచార్యులు, మనోజ్, విష్ణు, తాతాజీ పాల్గొన్నారు.

ప్రొఫెసర్‌కు యువ శాస్త్రవేత్త అవార్డు

విశాలాంధ్ర - కె.కోటపాడు: ప్రొంతాల మధ్య నివసిస్తున్న ప్రజల్లో వ్యాధుల తీవ్రత వ్యత్యాసంపై పరిశోధనాత్మక ప్రచురణకు 2023 సంవత్సరానికి గాను ఈ మండలం పిండ్రంగి గ్రామానికి చెందిన రంగం దేవుడు కుమారుడు డాక్టర్ మల్లారపు గంగరాజు యువ శాస్త్రవేత్త అవార్డు పొందారు. విశాఖ బుల్లయ్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న గంగరాజు ఢిల్లీకి చెందిన నేషనల్ ఎన్విరాన్మెంటల్ సైన్స్ అకాడమీ ద్వారా మెడికల్ జియోగ్రఫీలో మైదాన తీర ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు, కొండ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల మధ్య మలేరియా తదితర వ్యాధుల తీవ్రత వ్యత్యాసంపై పరిశోధనలు చేశారు. యువ శాస్త్రవేత్తగా ఎంపికైన గంగరాజుకు బుల్లయ్య కళాశాల యాజమాన్యం కేసిని రెడ్డి, డాక్టర్ జి.మధు కుమార్, డాక్టర్ చక్రవర్తి, సోమేశ్వర రెడ్డి, లక్ష్మణ బాబు పిండ్రంగి గ్రామ ప్రజలు అభినందించారు.

డీఆర్‌డీఏ ద్వారా నిధులు విడుదల చేయాలి

విశాలాంధ్ర - అనంతగిరి: మండలాల్లో డి.ఆర్.డి.ఏ ద్వారా ప్రజలకు అందే ప్రభుత్వ పథకాలు, సంక్షేమ పథకాల నిధులు విడుదల చేయాలని సీపీఎం జెడ్పీటీసీ దీసరి గంగరాజు పేర్కొన్నారు. విశాఖపట్నం ఉమ్మడి జిల్లా స్థాయి సంఘాల సమావేశాలు జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన సీఈఓ ఎం.పోలినాయుడు పర్యవేక్షణలో జరిగాయి. ఈ సందర్భంగా పాల్గొన్న దీసరి గంగరాజు మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులకు 2 వాలాల మాత్రమే పేమెంట్లు జమ అయ్యాయని, వేజ్ సీకర్స్ నేటికీ బకాయిలు అందలేదని అన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఇఒ డి.సత్యనారాయణ, జిల్లా పరిషత్ సూపర్ డెంట్ రాము, గొలుగొండ జెడ్పీటీసీ ఎం.వెంకట గిరిబాబు, విశాఖ డ్వామా పీడీ సందీప్, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏపీడీ జమ్మిది గిరి తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ మండల అధ్యక్షులకు సన్మానం

విశాలాంధ్ర - పాయకరావుపేట: జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ గెడ్డం బుజ్జి సూచనల మేరకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధ్యక్షులుగా నియమితులైన నాయకులను ఘనంగా సన్మానించారు. పాయకరావుపేట మండలం యగదాసు నానాజీ, నక్కపల్లి మండలం వెలగా సుధాకర్, యస్.రాయవరం మండలం పప్పల శివ, కోటవురట్ల మండలం సింగంపల్లి శ్రీను, పాయకరావుపేట పట్టణ అధ్యక్షులుగా నియమితులైన అరుంద దొరబాబు పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గెడ్డం బుజ్జి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గెడ్డం కన్నబాబు, జగ్గన్నదొర, పల్లి దుర్గారావు, పవన్, నల్లల రత్నాజీ, తమ్ముడు గణేష్, పాలపర్తి వెంకటరవి, గణేష్, బుజ్జి, వాసు, వినోద్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠాలకు పండగ సెలవులు



ఏయూ ఇంజనీరింగ్ సీఈఈలో జరగని తరగతులు
20 నుంచి పరీక్షలు... గగ్గోలు పెడుతున్న విద్యార్థులు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పలు పాఠశాలలకు ఈనెల తొమ్మిదో తేదీ నుంచి అధికారికంగా సెలవులు ప్రకటించగా, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కొంతమంది ఆచార్యులు మాత్రం ముందుగానే పండుగ సెలవులు తీసుకున్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా క్లాసులకు దుమ్మా కొడుతూ మమ్మల్ని ఎవరేమనగలరనే అన్న రీతిన దర్జాగా విధుల్లో బైపాస్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతిష్ఠాత్మక బ్రాంచ్ గా పేరుగాంచిన కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగంలో నెల రోజులకు పైగా విద్యార్థులకు పాఠాలు చెప్పడం లేదని తెలుస్తోంది. ఓవైపు సిలబస్ పూర్తికాకపోవడం, ఈనెల 20వ తేదీ నుంచి బీటెక్ సెకండ్ ఇయర్ సెమిస్టర్ పరీక్షలు జరుగనుండడంతో విద్యార్థులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. సిఎస్ఈ విభాగంలో ఫస్ట్ ఇయర్ నుంచి ఫోర్త్ ఇయర్ వరకు ఒక్కొక్క తరగతి కి సుమారు 800 మంది విద్యార్థుల ఉండగా, 17 మంది పర్మినెంట్ ఫ్యాకల్టీ, మరో 17 మంది అడ్జంక్ట్, టెంపరరీ ఫ్యాకల్టీ గా విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో శాశ్వత బోధన సిబ్బంది చెప్పాల్సిన పాఠాలు సిలబస్ లో ఐదు యూనిట్లకు గాను కనీసం ఒక్క యూనిట్ కూడా పూర్తి చేయలేదని తెలుస్తోంది. తాత్కాలిక ఫ్యాకల్టీగా పనిచేసే వారు మాత్రం నాలుగు యూనిట్లు సిలబస్ పూర్తి చేయడం గమనార్హం. విద్యార్థులకు పాఠాలు బోధించకుండా ఉండడమే కాకుండా వారికి ప్రత్యేక తరగతులు ఉన్నాయని, పిలిచి మరి పాఠాలు చెప్పకుండా సిఎస్ఈ విభాగాధిపతి విద్యార్థుల సహనానికి పరీక్ష పెడుతున్నారు. ఓవైపు పరీక్షల దగ్గర పడుతుండడం, మరోవైపు ఆచార్యులు పాఠాలు చెప్పకుండా ఉండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వర్సిటీ ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలిందిగా వారు కోరుతున్నారు.

వేతనాలు అమలుకు యాజమాన్యంపై ఒత్తిడి చేయాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్ కార్మికులకు నూతన వేతనాలు అమలుకై ఎన్.జె.సి.ఎస్. యాజమాన్యంపైన ఒత్తిడి చేయాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. ఈనెల 20వ తేదీన జరిగే పూర్తి ఎన్ జె సి ఎస్ సమావేశానికి ముందుగా స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వర్కింగ్ కమిటీ సభ్యుల సమావేశాన్ని కోల్‌కత్తలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాలు అమలుకు అడ్డంకిగా ఉన్న క్లాస్ నెంబర్ 8పై సెయిల్ యాజమాన్యంతో సంప్రదించే సమయంలో దీనిని తొలగించే విధంగా కృషి చేయాలని ఆయన అభ్యర్థించారు. జిందాల్ ఎం వో యు రద్దుచేసి సెయిల్ తో ఒప్పందం చేసుకునే విధంగా కృషి చేయాలని ఆయన్ని కోరారు. కార్యక్రమంలో అఖిలభారత సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన దుకాణం

విశాలాంధ్ర- పెదబయలు: మండల కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహానికి ఆనుకొని ఉన్న పెదబయలు గ్రామ నివాసి పాంగి ఫాల్గుణ విలేకరి చెక్క బడ్డీ (షాప్) అగ్నికి ఆహుతైంది. షాప్‌లో టీవిలు ఇతర వస్తువులు ఉండటంతో మంటలు చెలరేగి పెద్ద శబ్దం రావటంతో ఇరుగు పొరుగు వారు బయటకు వచ్చి షాప్ యజమానికి, అలాగే అద్దెదారుడైన గంపరాయి ప్రసాద్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఇరువురు సంఘటన స్థలానికి చేరుకొని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వీటిపై పలు అనుమాలు ఉండటంతో షాప్ యజమాని, అద్దెదారుడు ఇద్దరు కూడా స్థానిక పోలీస్ స్టేషన్‌లో వేరువేరుగా ఫిర్యాదు చేశారు. భారీగా ఆస్తి నష్టం జరిగిందని ఇరువురు వాపోయారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి నష్టపరిహారం అందించాలని కోరారు. బాధితుల్ని వర్తక సంఘం వారు, స్థానిక ప్రెస్ క్లబ్ మిత్రులు పరామర్శించారు.

డిఆర్‌హెచ్‌పి దరఖాస్తు చేసిన యూనికామర్స్ ఈ సొల్యూషన్స్ లిమిటెడ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: లావాదేవీల ప్రాసెసింగ్ లేయర్‌లో మార్చి 31, 2022తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి ఆదాయ పరంగా (మూలం: రెడ్‌సీర్ రిపోర్ట్), భారతదేశం యొక్క అతిపెద్ద ఇ-కామర్స్ ఎనేబుల్‌మెంట్ సాఫ్ట్‌వేర్-యాజ్-ఎ-సర్వీస్ ("సాస్") ప్లాట్‌ఫారమ్ యూనికామర్స్ ఈ సొల్యూషన్స్ లిమిటెడ్ , ఐపిఒ కోసం మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ("సెబీ ") వద్ద తమ డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ని దాఖలు చేసింది. 2022 ఆర్థిక సంవత్సరంలో భారతదేశంలోని ఈ విభాగంలోని మొదటి ఐదు సంస్థ లలో యూనికామర్స్ మాత్రమే లాభదాయకమైన కంపెనీ (మూలం: రెడ్‌సీర్ నివేదిక). 2012లో స్థాపించబడిన యూనికామర్స్ ఎఫ్ వై 21 నుండి పీ ఏ టీ-పాజిటివ్‌గా ఉంది. గత ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే 52.56 శాతం మరియు 47.55 శాతం ఆదాయ వృద్ధిని సాధించింది. సెప్టెంబర్ 2023తో ముగిసిన కాలానికి, యూనికామర్స్ రూ 103.74 కోట్ల వార్షిక పునరావృత ఆదాయాన్ని సాధించింది.

10 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధి లోదొడ్డి గ్రామ శివారున 10 లీటర్ల నాటు సారాయితో అదే గ్రామానికి చెందిన గోడపల శ్రీనుబాబు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు జడ్డంగి ఎస్ ఐ రఘునాదరవు తెలిపారు. సిబ్బంది సహాయంతో 100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి ముద్దాయిని రిమాండ్ తరలించగా రంపచోడవరం జె ఎఫ్ సి ఎం కోర్టు వారు ముద్దాయికి 15 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు.

నేడు స్వేచ్ఛ కమ్యూనిటీ డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

విశాలాంధ్ర -మారేడుమిల్లి: మారేడుమిల్లి మండలం వేటుకూరు గ్రామంలో స్వేచ్ఛ అనే ఒక స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ డిజిటల్ స్థాపించారు. దీనిని 12వ తేదీన ప్రారంభించనున్నారు. పంచాయతీలో పిల్లలకి డ్రాయింగ్, ఎస్సే రైటింగ్ ఎలక్యూషన్ పాటలు పాడడం నృత్యం ఇలా వివిధ విభాగాల్లో ఈవెంట్లు కూడా నిర్వహించనున్నట్లు స్వేచ్ఛ ప్రతినిధి, కేఎల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీవత్ వెల్లడించారు.

ఐస్ స్కేటింగ్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన తెలుగు తేజాలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: చదువే కాదు క్రీడల్లో కూడా మేమే నంబర్ వన్ అంటున్న మన విశాఖ పిల్లలు....గురుగ్రాం హర్యానాలో జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ ఐస్ స్కేటింగ్ క్యాంప్ అండ్ చాంపియన్షిప్ లో విశాఖకు చెందిన మురళి, రమేష్ అకాడమీకి చెందిన పిల్లలు పవన్ రిషిక్ కి స్వర్ణ, నవనీత్‌కి కాంస్య , దేవరాజ్, జోసెఫ్ రజతం పతాకాలను, ఫిగర్ స్కేటింగ్‌లో పుర్విత్ స్వర్ణం, రోక్షిత్ ఆనంద్ కాంస్యం సాధించారు. విశాఖ ఘనతను జాతీయ స్థాయి పోటీలలో దేశవ్యాప్తంగా చాటి చెప్పారు. ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్‌మురళి మాట్లాడుతూ దేశంలోనే అతి తక్కువ ప్రదేశాల్లో ఉన్న ఈ ఐస్కేటింగ్ మన విశాఖపట్నం పిల్లలు ఎటువంటి ఐస్ స్కేటింగ్ రింక్లు మనకు అందుబాటులో లేనప్పటికీ రోలర్ స్కేటింగ్ మీదే శిక్షణ పొందుతూ ఐస్కేటింగ్లో రాణించడం చాలా ఆనందకరంగా గర్వంగా ఉందన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి చేయూత

విశాలాంధ్ర - చింతూరు: చింతూరు మండలం పేగ గ్రామంలో బుధవారం రాత్రి మడకం పెంటయ్య ఇల్లు దగ్ధం అయింది. ఆ కుటుంబానికి చింతూరు మండల టీడీపీ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు బియ్యం, కందిపప్పు, ఉల్లిపాయలు, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చింతూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇల్ల చిన్నారెడ్డి, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి శీలంతమ్మయ్య, మండల సీనియర్ నాయకులు పొదిలి రామారావు, యూత్ నాయకులు కుంజ బాలకృష్ణ, పేగ సీనియర్ నాయకులు సరియం బ్రహ్మయ్య, బూత్ ఇన్‌చార్జి సోడే శ్రీను, యూత్ నాయకులు సరియం రవీంద్ర, బూత్ తునికి సత్యం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గొందేసి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జిల్లా ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గొందేసి బైరెడ్డి నియమితులయ్యారు. జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ నియామక పత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లాలో కీలక బాధ్యతలు అప్పగించారని ,కార్మిక సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఐ. ఎన్ టీ యు సి జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డి, ఉక్కు ఐఎన్‌టీయూసీ ప్రెసిడెంట్ నీరుకొండ్ రామచంద్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కారు రమణ, జనరల్ సెక్రటరీ రాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మెలో సాధించిందేముంది...?

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సమ్మె చేసిన కొన్ని కార్మిక సంఘాలు అవి సాధించలేకపోయాయని సమ్మె వల్ల కార్మికులు నిరుత్సాహం ఏర్పడిందని జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (వైయస్సార్ టి యు) సెక్రటరీ జనరల్ వివి వామనరావు తెలిపారు. గురువారం సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమ్మె విరమణ ఎందుకు చేశారని, ఏం సాధించారని సమ్మె చేశారని ఆయన ప్రశ్నించారు. కార్మికులను మభ్యపెట్టడానికి విశాఖలో విజయోత్సవ సభలు నిర్వహిస్తున్నారని, తాత్కాలిక సమ్మె విరమణ అని రాష్ట్ర నేతలు చెబితే జిల్లాలో విజయోత్సవ సభలు జరపడం సిగ్గుచేటు అన్నారు. మున్సిపల్ మహాసభ రోజునే మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్ ఈ హామీలను ప్రకటించారని అప్పుడే సమ్మెను విరమించాల్సిందని అన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

విశాలాంధ్ర - చోడవరం: చోడవరంలో ప్రభుత్వ హై స్కూల్ వెనుకన గల విశ్రాంత ఎం.డి.ఒ. కొండలరావు ఇంటికి వున్న ఇనుప కిటికీకి ఉరి వేసుకొని ఓ యువకుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందడం సంచలనం రేపింది. మృతుడుది బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన వత్తి ప్రశాంత్ (24) గా గుర్తించారు. మృతుడు ప్రశాంత్ కాయగూరల దుకాణంలో పనిచేస్తూ, అనకాపల్లి మార్కెట్ కి వెళ్లి, గురువారం ఉదయానికి ప్రశాంత్ శవమయ్యాడని తల్లి తండ్రులిద్దరూ బోరున విలపిస్తున్నారు. మృతుడికి తండ్రి అప్పలనాయుడు, తల్లి పార్వతమ్మ, ఇద్దరు చెల్లెళ్ళు వున్నారు. రాత్రి 11 గంటలకు తల్లికి ఫోన్ చేసినట్లు బంధువులు చెప్తున్నారు. అతనిని ఎవరైనా హత్య చేశారా, లేక ఆయనే ఆత్మహత్య చేసుకున్నాడా అనే వివరాలు పోలీసు విచారణలో తెలియాల్సి ఉంది. చోడవరం సిఐ బి.శ్రీనివాసరావు, ఎస్.ఐ.లు తమ సిబ్బందితో వెళ్లి విచారణ చేస్తున్నారు. మృతునికి అంకుపాలెంలోనూ వడ్డాదిలోనూ బంధువులు ఉన్నారని తెలిసింది. మృతదేహాన్ని పరిశీలించిన సీఐ శ్రీనివాసరావు, క్లూస్ టీంను రంగంలోకి దించారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలంటూ పాదయాత్ర

విశాలాంధ్ర - పాయకరావుపేట: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ నెల్లూరుకు చెందిన చింతల అశోక్ కుమార్ పాదయాత్ర చేపట్టారు. ఇచ్ఛాపురం నుంచి తిరుపతి వరకు సుమారు 1200 కిలోమీటర్లు నిర్వహించనున్న పాదయాత్ర గురువారం పాయకరావుపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండలం అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు పట్టణ అధ్యక్షులు పెదిరెడ్డి శ్రీను, పల్లా విలియం కేరి, బొంది కాశీ విశ్వనాథ్, లెక్కల గోవింద్ నాయుడు, చింతకాయల రాంబాబు, జూరెడ్డి ప్రసాద్, మలిపెద్ది వెంకట రమణ, గుల్లా నాగరాజు, వేములపూడి అప్పారావు, కశింకోట సత్తిబాబు, గొర్ల లక్ష్మి నారాయణ, చిరుకూరి పేర్రాజు, బోడపాటి శ్రీను, దువ్వి శ్రీను, ఏమిలి దుర్గ ప్రసాద్, రాజన ఆది, పల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలి

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం మేజర్ పంచాయతీలో బకాయిపడిన ఐదు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాల్సిందిగా డిమాండ్ చేస్తూ సి.పి.ఐ. జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద బైఠాయించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలుతో జీతాలు లేక కార్మికుల కుటుంబాలు పండుగ పూట పస్తులు వుండాలా అని ప్రశ్నించారు. కొత్తూరు జంక్షన్‌లో కార్మికులు మానవహారం ఏర్పడి కార్మికుల సమస్యల పట్ల మొండి వైఖరి చూపుతున్న పంచాయతీ పాలకులు, అధికారుల తీరు కు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు.

పంచాయతీ ఇంఛార్జి కార్యదర్శి చిన్నారావు ఆందోళనకారుల తో మాట్లాడి, కార్మికుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు. తక్షణమే కాయికుల వేతన బకాయిలు చెల్లించాల్సిందేనని కార్మిక సంఘాల వారు పట్టుబట్టారు. దీంతో సుమారు అర్ధగంట పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

వికసిత భారత నిర్మాణం కోసం మోదీకి మద్దతు ఇవ్వండి

బీజేపీ కన్వీనర్ గొర్లె రాము నాయుడు

విశాలాంధ్ర - పరవాడ: వికసిత భారత్ నిర్మాణం కోసం కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని భారతీయ జనతా పార్టీ పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ గొర్లే రాము నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని తానాం, భరిణికం గ్రామాలలో జరిగిన భారత్ వికసిత్ సంకల్ప యాత్రలో ఆయ న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామాలలో పర్యటించి ప్రజలను కలిసి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్న రాము నాయుడు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మోడీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని సూచించారు. అనంతరం గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ సుసంపన్న భారతావని సాధన కోసం బిజెపి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, అన్ని వర్గాలు ఆర్థికంగా బలపడాలనే ప్రధాని నరేంద్ర మోడీ ఉద్దేశాన్ని అర్థం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను రామునాయుడు ఘనంగా సత్కరించారు. కాగా వాడ చీపురుపల్లి గ్రామానికి చెందిన ఓ వికలాంగుడికి రామనాయుడు ఆర్థిక సాయం అందించి మానవత్వం ప్రదర్శించారు. గ్రామాల్లో మహిళలు రైతులు పెద్ద సంఖ్యలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొని మద్దతు పలికారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు సోమశేఖర్, రామకృష్ణ, నూకరాజు సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో అయోధ్య రాముని అక్షింతలు కరపత్రాలను బిజెపి నాయకులు కార్యకర్తలతో కలిసి గొర్లె రామ్ నాయుడు పంపిణీ చేసారు.

కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె

విశాలాంధ్ర - ఆనందపురం: అంగన్వాడి కార్యకర్తల ఆందోళనకు జనసేన పార్టీ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని భీమిలి ఇన్‌చార్జ్ పంచకర్ల పేర్కొన్నారు. గురువారం ఆనందపురం కూడలిలో అంగన్వాడి కార్యకర్తలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి సందీప్‌కి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఎప్పుడు అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలం అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు, బివి కృష్ణయ్య, శేఖరి శ్రీనుబాబు, తాడివాడ శివకృష్ణ, బాలు, నాయుడు, సంతోష్ నాయుడు, ప్రశాంత్ కుమార్ నాయుడు, నాగేశ్వరరావు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం సరిగా స్పందించకపోతే సంక్రాంతి పండుగ తర్వాత పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సిపిఎం నాయకులు గంగారం సిఐటియు నాయకులు శంకర్రావు, జగన్నాథం స్పష్టం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద అంగన్వాడి కార్యకర్తలు చేపట్టిన నిరాహార దీక్షలు గురువారం కొనసాగాయి. అంగన్వాడీలకు సంఘీభావం తెలిపిన సిపిఎం నాయకులు గంగా రామ్, సీఐటీయూ నాయకులు శంకర్ రావు, జగన్నాధస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే పండగ తర్వాత అన్ని ప్రజా సంఘాలు కలుపుకొని అంగన్వాడి కేంద్రాల వద్ద నిరసన కార్యక్రమాలు చేయడానికి వెనకాడమని హెచ్చరించారు. పారిశుద్ధ్య కార్మికులు ఇప్పటికే పోరాడే తమ సమస్యను పరిష్కరించుకున్నారని గుర్తు చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే బృందావతి, సృజన, ఝాన్సీ భవాని సంతోషి రాజేశ్వరి ధన పాల్గొన్నారు.

రాళ్లగెడ్డలో రాజ్యమేలుతున్న సమస్యలు

విశాలాంధ్ర - చింతపల్లి: రాళ్లగెడ్డలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని బలవం పంచాయితీ వార్డు సభ్యుడు సిందెరి సోమరాజు అన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై గురువారం గ్రామస్తులతో కలసి ఆయన మాట్లాడుతూ తరతరాలుగా తమ పంచాయతీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. పంచాయతీకి శివారు గ్రామమైన రాళ్లగడ్డలో త్రాగునీటి సమస్య తాండవిస్తు ఒదన్నారు. సుమారు 100కు పైగా గిరిజన కుటుంబాలు కలిగిన ఈ గ్రామంలో తరతరాలుగా త్రాగునీటి సమస్య తమను పట్టిపీడిస్తుందన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతమంది ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చిపోతున్నా తమ గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఏ ఒక్కరూ స్పందించిన దాఖలాలు లేవన్నారు. పంట పొలాలకు అనుకొని ఉన్న ఊట గెడ్డ నుండి త్రాగునీరు తెచ్చుకోవలసిన పరిస్థితి ఉందన్నారు. వ్యవసాయ సీజన్లోనూ, తుఫాను, వర్షాల సమయంలోనూ తమ గ్రామంలో ఉన్న ఊటగెడ్డ కలుషితం అవుతుందని ఈ సమయంలో త్రాగునీటికి కటకటలాడవలసిన పరిస్థితి ఉందని గిరి మహిళలు గగ్గులు పెడుతున్నారన్నారు. వీధులలో సిమెంటు రహదారులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొర్ర నూకరాజు, వంతల చిన్నారావు, సుబ్బారావు, లేబు రామారావు, కిల్లో రామారావు పాల్గొన్నారు.

విధులను విస్మరించిన వైద్యులు, వైద్య సిబ్బంది

విశాలాంధ్ర - చింతపల్లి: ప్రసవ వేదనతో వివిధ మారుమూల గ్రామాల నుంచి కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలివచ్చిన గర్భిణీలకు గడ్డు పరిస్థితి ఎదురయింది. మన్య ప్రాంతంలో గిరి మహిళలకు ప్రసవం కత్తి మీద సాము వంటిది. మారుమూల గ్రామాల నుంచి సమీప ఆసుపత్రులకు చేరుకునేందుకు రహదారి, రవాణా సౌకర్యాలు లేకపోవడం, డోలిమోతలతో ఆసుపత్రులకు చేరుతున్న క్రమంలో మార్గ మధ్యలోనే ప్రసవించిన సందర్భాలెన్నో ఉన్నాయి. ఇటువంటి తరుణంలో ప్రసవ వేదనతో ఆసుపత్రికి వచ్చిన గిరి గర్భిణీల సమస్య చూసేందుకు ఆసుపత్రిలో ఒకే ఒక్క ఏఎన్ఎం విధులలో ఉండడం గమనార్హం. ఈ క్రమంలో ఆసుపత్రిలో ఉండవలసిన ఇరువురు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఎక్కడ అని బాధిత కుటుంబ సభ్యులు ప్రశ్నించగా వైద్య శిబిరానికి వెళ్లారని ఒకసారి, పిక్నిక్ పెట్టుకున్నారని మరో సారి పొంతన లేని సమాధానం రావడం విశేషం. రహదారి, రవాణా సౌకర్యాలు లేని జోహారు గ్రామం నుంచి పాంగి సీత, బూరుగు బయలు గ్రామం నుంచి ఊలంగి పార్వతి లు ఆశా కార్యకర్తల సహకారంతో ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ దశలో జోహారు గ్రామానికి చెందిన సీత ప్రసవ వేదనతో ఇబ్బంది పడింది. ఈ విషయమై వైద్యాధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా (ఫోన్ లో) అందుబాటులో లేకపోవడంతో ఏజెన్సీ డి ఎం అండ్ హెచ్ ఓ జమాల్ బాషాను వివరణ కోరగా దీనిపై విచారణ జరిపి చర్యలు చేపడతానని ఆయన తెలిపారు.

జనసేన పార్టీ మండల అధ్యక్షులుగా తమ్మిన అప్పలరాజు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండల జనసేన పార్టీ అధ్యక్షులుగా తమ్మిన అప్పలరాజు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళగిరి కేంద్ర పార్టీ కార్యాలయం నుండి తమ్మిన ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో ఉమ్మడి జనసేన, టిడిపి గెలుపునకు అన్ని విధాలుగా కృషి చేస్తానని అన్నారు. ఈ పదవి ఇచ్చినందుకు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కి అలాగే భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జ్ పంచకర్ల సందీప్‌కు ధన్యవాదాలు తెలిపారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం

విశాలాంధ్ర- గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడును పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్నిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. చంద్రబాబు నేరుగా విజయనగరం జిల్లా బొబ్బిలి నియోజకవర్గంలో జరగబోయే బొబ్బిలి గర్జన. "రా ...కదలిరా' కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లారు.

జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్‌కు ఆదిత్య విద్యార్థిని

విశాలాంధ్ర- గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు చరిష్మ సాయికి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన ఆంధ్రా యునివర్సిటీ బాక్సింగ్ టోర్నమెంట్‌లో ఎంపికై ఫిబ్రవరి నెలలో ఉత్తర ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ కె.మురళీకృష్ణ తెలిపారు. చరిష్మ సాయి ఇప్పటివరకు 23 పతకాలు సాధించింది. వీరిని ఆదిత్య డిగ్రీ కళాశాలల సెక్రటరీ ఎస్.సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డా. నాయుడు, ప్రిన్సిపల్ మురళీ మోహన్‌రావు అభినందిచారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలు

విశాలాంధ్ర - చీడికాడ: మండల కేంద్రంలోని హైస్కూల్లో మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం కో కో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ రెండు పోటీల్లోనూ దిబ్బపాలెం జట్లు విజయం సాధించాయి. దీంతో గ్రామస్తులు వీరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయప్రకాశరావు, పంచాయతీ సెక్రటరీ సన్యాసిరావు, పిడి మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన

విశాలాంధ్ర - చీడికాడ: లేగ దూడల ప్రదర్శన రైతులకు ఉత్సాహం కలిగిస్తుందని పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ రాంమోహన్‌రావు అన్నారు. మండలం లోని ఖండివరం గ్రామంలో జర్సీ, హెచ్‌ఎఫ్, ఒంగోలు ముర్రా గేదే జాతి లేగదుడల మండలస్థాయి ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పాడి రైతులు తమ ఆవులకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు వేయించుట వలన ఆరోగ్యంగా ఉంటాయన్నారు. పోటీలో గెలుపొందిన రైతులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూరచా నారాయణమూర్తి, సుంకర శ్రీనివాసరావు, శిరంరెడ్డి అప్పలనాయుడు, డివిజినల్ డిడి నరసింహులు, గెంజి బాలాజీ, సిబ్బంది వి.చిట్టినాయుడు, కెవియస్ రాఘవమ్మ, ఏసీహెచ్ గణేష్ పాల్గొన్నారు.

5వ వార్డులో క్రికెట్ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - మధురవాడ: స్థానిక 5వ వార్డులో భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, 5వ వార్డు వైసీపీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు సూచనలతో క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. 76వ సచివాలయం పరిధిలో గల రాజీవ్ గృహకల్ప, జేఎన్ఎన్ యూఆర్ఎం మారికవలస కాలనీ క్రికెట్ టీం సభ్యులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సెక్రటరీలు పురుషోత్తం, భాస్కర్, సచివాలయం కన్వీనర్లు వారణాసి శ్రీనివాసరావు, కల్లేపల్లి శంకర్రావు, అంబటి లక్ష్మి, రిషికేశ్వరరావు, ఎన్ని రమణ, క్రికెట్ టీం కెప్టెన్ నరేష్, వైస్ కెప్టెన్ మురళి తదితరులు పాల్గొన్నారు.

బెహరాకు సత్కారం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 92వ వార్డు పద్మనాభ నగర్ దారి తారు రోడ్డు పూర్తయిన సందర్భంగా అక్కడ ప్రజలు జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాలాపు మారయ్య, రాపర్తి అప్పారావు, సాలాపు శ్రీను, సాలాపు ఈశ్వరరావు, కెవి భాస్కర్ రావు, నర్సింగరావు, నాగరాజు, మధు, అప్పలరాజు, శివ, దేవి, లక్ష్మి, కనకమ్మ, మారమ్మ పాల్గొన్నారు.

స్టేట్ లెవెల్ నెట్ బాల్ పోటీలకు సన్ స్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర - భీమిలి: ఒంగోలు ఏబీఎన్ జూనియర్ కాలేజీల స్టేట్ లెవెల్ నెట్ బాలన్స్ ఛాం పియన్ షిప్‌కు సన్ స్కూల్‌కి చెందిన విద్యార్థులు నిహారిక, నికితలు ఎంపికయ్యారు. నెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో తెలంగాణ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం మహబూబ్ నగర్లో ఈనెల 11 నుంచి 17 వరకు జరగనున్న పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా స్కూల్ కస్పాండెంట్ కే.శ్రీనివాసరావు వ్యాయామ ఉపాధ్యాయులు పి.అరుణ్ కుమార్‌ను అభినందించారు.

జనసేన మండల అధ్యక్షుడిగా దొరబాబు

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలం జనసేన పార్టీ మండల అధ్యక్షునిగా పాత మల్లంపేట గ్రామానికి చెందిన గడ్డం దొరబాబును జిల్లా జనసేన పార్టీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ నర్సీపట్నం నియోజవర్గ కన్వీనర్ రాజానసూరి చంద్ర, జనసేన పార్టీ సీనియర్ నాయకులు రేగుబిల్ల శివ జనసేన నాయకులు కలిసి తనను గుర్తించి ఈ పదవి వచ్చే విధంగా కృషి చేశారని్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

ప్రజల ఆర్థిక పురోగతికి తోడ్పాటు అందించాలి

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, సామాన్య ప్రజల ఆర్థిక పురోగతికి తోడ్పాటు అందించాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర అధికారులకు సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతీ సంక్షేమ ఫలం వారికి అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పని చేస్తున్న వారికి అండగా నిలవాలని పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఆమె అధ్యక్షతన 1 నుంచి 7 వరకు స్థాయీ సంఘ సమావేశాల జరిగాయి. ప్రజా పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, సంక్షేమం, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. సమావేశాల్లో వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ముందుగా చదివి వినిపించారు. వాటిపై సభ్యుల ప్రశ్నలకు ఆయా శాఖల అధికారులు సమాధానాలు ఇచ్చారు.

ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే చర్యల గురించి వివరించారు. జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ పలు అంశాలపై మాట్లాడారు. మహిళల ఆర్థిక ప్రగతికి కృషి చేయాలని, మైదాన ప్రాంతాల్లో మాదిరిగా పాడేరు, అరకు ప్రాంతాల్లో కూడా మహిళా మార్టులను ప్రారంభించాలని డీఆర్డీఏ పీడీకి సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే పనుల్లో మరింత నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. యువత ఉపాధికి అవకాశ మార్గాలను అన్వేషించాలని, స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని చెప్పారు. మినీ గోకులాలకు సంబంధించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, వాటి ప్రయోజనాలు అందుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, జడ్పీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు రూ.8.31 కోట్లు విడుదల

విశాలాంధ్ర బ్యూరో -పాడేరు : జగనన్న తోడు పథకం లబ్దిదారులు 7862 మందికి రూ. 8 కోట్ల 31 లక్షల 86 వేల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలియ జేసారు. 3910 మంది లబ్దిదారులకు సాంప్రదాయ వృత్తి వ్యాపారులకు రూ.7 లక్షల 41 వేల 952 మందికి వడ్డీ జమ చేయడం జరుగుతోందన్నారు. గురువారం తాడేపల్లి ముఖ్య మంత్రి క్యాంపు కార్యాలయం నుండి ఎనిమిదవ విడత జగనన్న తోడు ఆర్థిక సహాయం విడుదల, వడ్డీ విడుదల ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు శాసన సభ్యురాలు కొట్ట గుల్లి భాగ్యలక్ష్మి, వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో రూ.10 వేలు రుణాలు పొందిన లబ్దిదారులకు వడ్డీని లబ్దిదారుల ఖాతాలకు జమ చేసారని అన్నారు. అరకు వ్యాలీ నియోజక వర్గంలో 397 మందికి రూ.1 లక్ష 32 వేలు, పాడేరు నియోజక వర్గంలో 210 మందికి రూ.67 వేలు, రంపచోడవరం నియోజక వర్గం లోని 3303 మందికి 5 లక్షల 43 వేలును ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. జిల్లాలో 3910 మంది లబ్దిదారులకు రూ.7లక్షల 42 వేలు జమవుతుందని చెప్పారు. జగనన్న తోడు ఆర్థిక సహాయంతో ఏం చేస్తున్నారని లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. బట్టల వ్యాపారం, పాల వ్యాపారం చేస్తున్నామని లబ్దిదారులు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డిఏ పిడి వి.మురళి, పంచాయతీ రాజ్ పి ఐ యు ఇ ఇ కె. లావణ్య కుమార్, వెలుగు సిబ్బంది, లబ్దిదారులు పాల్గొన్నారు.

బకాయి పడ్డ జీతాలు తక్షణమే చెల్లించాలి

విశాలాంధ్ర – చోడవరం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులకు బకాయిపడ్డ రెండు నెలల వేతనాలు తక్షణమే చెల్లించి సంక్రాంతి పండగ కి కార్మికులు కుటుంబాలు పస్తులులేకుండా చూడాలని ఏ.పి. మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ %ఒ% వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక సి.హెచ్.సి ఆసుపత్రి లో కార్మికులు గురువారం ముచ్చు కోటీశ్వరరావు అధ్యక్షతన జరిపిన సమావేశానికి ఏ.ఐ.టి.యూ.సి. అధ్యక్షుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విడుదలచేసిన జీవో 549 ప్రకారం కనీస వేతనం జిల్లాలో చెల్లించకుండా కార్మికులు కు అన్యాయంచేస్తున్నారు అన్నారు. ఉద్యోగులకు, కార్మికులకు ప్రతినెలా 7వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, సంవత్సరానికి 2 జతల యూనిఫారం, ప్రతి 6 నెలలకోసారి ఆరోగ్య రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ వినయ్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ నాయకులు ఉప్పిలి. ప్రవీణ్, ఆసుపత్రి కార్మికులు ఎమ్. కోటీశ్వరరావు, వై. సుశీల, కుమారి, నూక రత్నం, నూకరాజు,లక్ష్మి,శ్రీను, సోమేష్ పాల్గొన్నారు.

31వ రోజుకు చేరుకున్న అంగన్వాడీల దీక్ష

విశాలాంధ్ర – పాయకరావుపేట: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మె పాయకరావుపేట లో 31వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 2 తీసుకువచ్చి, అంగన్వాడీ లను అత్యవసర సర్వీసులు పరిదిలోకి తీసుకు వచ్చి ఆరు నెలల పాటు సమ్మె చేయకూడదని, వెంటనే విధుల్లోకి చేరాలని ఆదేశిస్తూ అంగన్వాడీ ప్రోజెక్టు అధికారులు, గ్రామ సచివాలయ అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు నోటీసు ఇస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజు తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తీసుకోకపోవడంతో వారి ఇళ్ళకు, అంగన్వాడీ కేంద్రాలకు నోటీసులు అంటిస్తున్నారని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు భయపడకుండా జీతాలు పెంచేవరకు, గ్రాట్యుటీ అమలు చేసే వరకూ విధులకు హాజరు అయ్యేది లేదని సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేస్తూ సమ్మె కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.నాగేశ్వరరావు, నూకరత్నం, సత్యవేణి, తులసి, జ్యోతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే విజయం సాధ్యం

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా జరిగిన చర్చలు సఫలం కావడంతో జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసి) ఆధ్వర్యంలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద జరిగిన కార్యకర్తల సమావేశం లో అధ్యక్షులు పడాల రమణ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోకుండా సమస్యల సతమతమవుతున్న పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అదును చూసి పదును పెట్టిందని , చిన్న పెద్ద తేడా లేకుండా మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న అన్ని కార్మిక సంఘాలతో జేఏసీ ఏర్పాటు చేసి ఐక్యంగా పోరాడి విజయం సాధించామని అన్నారు. ఐక్య ఉద్యమాల ద్వారానే రానున్న రోజుల్లో మరిన్ని హక్కులకు పోరాడుతామని, సమ్మెలో పాల్గొని సహకరించిన కార్మిక ఉద్యోగులకు అభినందనలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏఐటీయూసీ నాయకులు కాసారపు సత్యనారాయణ, బంగారు దుర్గారావ్. లింగాల వెంకటేష్, పిట్టా కిషోర్, శేఖర్ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

గిరీష్ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర – పెదగంట్యాడ: గిరీష్ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు జరిగాయి. స్కూల్ నందు విద్యార్థులు బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. విద్యార్థులు మన సాంప్రదాయ దుస్తులు హరిదాసు, గంగిరెద్దుల వేషాలు వేసుకొని హరిదాసు వచనాలు నృత్య రూపాలతో అలరించారు. మన సాంప్రదాయ పిండి వంటకాలు తయారీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ భ్రమరాంభ, ఇన్‌చార్జ్ సురేష్, అరునకుమార్, ఇత్మరియు భోదనా సిబ్బంది భోదనేతర సిబ్బంది పాల్గొన్నారు.

200 పశువులకు గాలికుంటు టీకాలు

విశాలాంధ్ర – వి. మాడుగుల: మండలంలోని కోడూరులో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధానికి వ్యాక్సినేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవ్ రావు, గొల్లవిల్లి రాజేష్, పడాల అప్పలనాయుడు, రాయపురెడ్డి కొండలరావు, మాడుగుల కోడూరు వెటర్నరీ డాక్టర్ అరుణకిరణ్, ఏహెచ్ఏ చంద్రరావు, ఓఎస్ అర్జున్ రావు పాల్గన్నారు. పశువైద్యశాల పరిధిలోని మొత్తం 200 పశువులకు వ్యాక్సిన్ వేశారు. టీకా కార్యక్రమం జనవరి 31 వరకు జరుగుతుందని,3 నెలల కంటే ఎక్కువ వయస్సు ఉన్న అన్ని పశువులు, గేదెలకు టీకాలు జరుగుతుందని హౌస్ వైద్యాధికారులు తెలిపారు.

నూనె రమేష్‌కు సాహితీ సంక్రాంతి పురస్కారం

విశాలాంధ్ర – వి. ఆర్. పురం: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో ఏలూరు లో జరిగిన సంక్రాంతి సాహితీ సంబరాలు కార్యక్రమంలో మన్యం కవి నూనె రమేష్ ను సంక్రాంతి సాహితీ పురస్కారం 5000 వేల రూపాయల నగదు బహుమతి,ధ్రువపత్రంతో సాహిత్య అకాడమి ఛైర్పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి సన్మానించారు. ఈ పురస్కారం అందుకొన్నందుకు కవి నూనె రమేష్ తల్లి దండ్రులు నూనె అజరయ్య శాంతి దంపతులు మండల ప్రముఖులు, గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. మన్యంలో పుట్టి కవిగా ఎదిగి ఆంధ్రప్రదేశ్ సాహితీ పురస్కారం అందుకున్న నూనె రమేష్ మరిన్ని సత్కారలు అవార్డులు పొందాలని అభిలాషించారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర – ఎటపాక : ఎటపాక మండలం కృష్ణవరం గ్రామంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంబించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి ఎటపాక మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు హాజరై మాట్లాడుతూ యువత క్రీడల్లో ముందుండాలని. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఆరోగ్యానికి ఎంతో దోహదపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ మాచినేని రాజేష్, ఎంపిటిసి దేవి, కంటే నందు, బొల్లా నగేష్, కణితి మధు. ఉండేటి రమేష్, దానే రాజు, కాకా రాజు, దానే ప్రసాదు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి డీఆర్డీఏలో అవినీతిపై చర్యలేవి

విశాలాంధ్ర – గొలుగొండ: అనకాపల్లి డిఆర్డిఏలో బినామీ రుణాల్లో 8 కోట్ల అక్రమాలపై విచారణ జరిపి నెలలు గడుస్తున్న చర్యలు చేపట్టడంలో పిడి చర్యలు చేపట్టకపోవడంలో పలు ఆరోపణలు వినిపిస్తున్నాయని అసలు డిఆర్డిఏలో పారదర్శకత, జవాబిదారితనం ఉందా అని ప్రజాసంకల్ప వేదిక (ఆర్టిఐ) రాష్ట్ర కార్యదర్శి జక్కు నరసింహామూర్తి ప్రశ్నించారు. తక్షణమే అక్రమార్కులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు అనకాపల్లి సత్యనారాయణపురం పది గ్రూపులు నకిలీవి ఏర్పాటుచేసి బ్యాంకు వాళ్లతో వెలుగు సిబ్బంది లాలూచీపడి 8 కోట్ల రూపాయలు అక్రమాలు జరిగాయని జిల్లా కలెక్టర్ ఆదేశాలపై విచారణకు కమిటీ వేసి విచారణ చేపట్టి నివేదిక ఇచ్చారని అయినప్పటికీ చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.

ఓలాలో 15 వేలు హార్వెస్ట్ ఫెస్టివల్ ఆఫర్లు

విశాలాంధ్ర – విశాఖపట్నం: సంక్రాంతి పండుగ ప్రారంభానికి గుర్తుగా 'ఓలా' ఎలక్ట్రిక్ రూ. 15 వేలు వరకు విలువైన హార్వెస్ట్ ఫెస్టివల్ ఆఫర్లను ప్రకటించింది. ఈ ఆఫర్ జనవరి 15వ తేదీ వరకు అమలులో ఉంటుంది. ఈ ఆఫర్‌లో భాగంగా ఎస్1 ప్రో, ఎస్1 ఎయిర్ కొనుగోలుపై రూ. 6,999 వరకు పొడిగించిన బ్యాటరీ వారంటీ, రూ. మూడు వేల వరకు ఎక్స్‌ఛేంజ్ బోనస్, ఆకర్షణీయమైన ఫైనాన్స్ డీల్‌లు ఉన్నాయి. అదనంగా ఎస్1 ఎక్స్‌ం ఫ్లాట్ రూ.20 వేల తగ్గింపుతో రూ. 89,999 వద్ద అందుబాటులో ఉంటుంది. క్రెడిట్ కార్డ్ ఈఎంఐతో రూ.5 వేల వరకు తగ్గింపును పొందవచ్చు. అయితే, ఇతర ఫైనాన్స్ ఆఫర్‌లలో జీరో డౌన్ పేమెంట్, నో-కాస్ట్ ఈఎంఐ, జీరో-ప్రాసెసింగ్ ఫీజు 7.99 శాతం తక్కువ వడ్డీ రేట్లు వంటి ఇతర డీల్‌లు ఉంటాయి.

ఓలా ఎలక్ట్రిక్ పోర్ట్‌ఫోలియోను ఐదు ఉత్పత్తులకు విస్తరించింది. ఎస్1 ప్రో (2వ తరం) ధర రూ. 1,47,499 కాగా, ఎస్1 ఎయిర్ ధర రూ. 1,19,999.. అదనంగా ఎస్1ఎక్స్ మూడు వేరియంట్‌లలో పరిచయం చేసింది. ఎస్1 ఎక్స్‌ం, ఎక్స్1 ఎక్స్ (3కేడబ్ల్యుహెచ్), ఎస్1 ఎక్స్ (2కేడబ్ల్యుహెచ్) రైడర్‌ల అవసరాలను తీర్చనుంది. ఎస్1 ఎక్స్ (3కేడబ్ల్యుహెచ్), ఎస్1 ఎక్స్ (2కేడబ్ల్యుహెచ్) కోసం రిజర్వేషన్ విండో రూ. 999 వద్ద ఉంది. ఇది వరుసగా రూ. 99,999 రూ. 89,999 ప్రారంభ ధరలో అందుబాటులో ఉంటుంది.

ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

విశాలాంధ్ర – చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సింహ ఆదేశాలతో చింతూరు ఓఎస్‌డి మహేశ్వర్ రెడ్డి, ఏఎస్పీ రాహుల్ మీనా, సిఆర్పిఎఫ్ 42వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ సురేష్ పర్యవేక్షణలో చింతూరు మండలంలోని పేగ గ్రామపంచాయతీ పరిధిలోని అల్లిగూడెం గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా గిరిజన యువతీ యువకులకు వాలీబాల్ పోటీలను ఓఎస్డి మహేశ్వర్ రెడ్డి ఏఎస్పీ రాహుల్ మీనా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరంలో కొత్తగూడెంకు చెందిన శ్రీ ఉష మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్ అజ్మీర వెంకన్న, ఎండి జనరల్ భద్రాచలం డాక్టర్ మోహన్ రావు, నిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బాల నరసింహుడు, ఎండి జనరల్ డాక్టర్, ఎం గురు తేజ ఆర్థోపెడిక్, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శ్రీహర్ష ఎండి పిల్లల వైద్య నిపుణులు, డాక్టర్ శశికళ దేవి ఎండి గైనకాలజీ ఎండి గైనకాలజిస్ట్ చింతూరు, డాక్టర్ ప్రసన్న ఎంబిబిఎస్, మరియు చర్మవ్యాధుల ప్రత్యేక ప్రభుత్వ వైద్య నిపుణులు డాక్టర్ టీపీ శేషారెడ్డి, ప్రభుత్వ వైద్య సిబ్బంది పాల్గొని వైద్య సేవలందించారు. 350 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో చింతూరు సిఐ గజేంద్ర, ఎటపాక ఎస్సై యాదగిరి, చింతూరు ఎస్ఐ శ్రీనివాస్, తదితరులు పేగ గ్రామపంచాయతీ సర్పంచ్ చంద్రయ్య, ఎంపీటీసీ నాగరాజు పాల్గొన్నారు.

గ్రామాలలో ధనుర్మాస మేలు కొలుపులు

విశాలాంధ్ర – వి. మాడుగుల: ధనుర్మాస పర్వదినాలను పురస్కరించుకొని నెల గంట పెట్టిన దగ్గర నుండి ప్రతిరోజు గ్రామాలలో మేలుకొలుపులు భక్తి కార్యక్రమాన్ని ఆయా గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో భోగి పండుగ వరకు ఈ మేలుకొలుపులు భక్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు పడాల కొండలరావు, గొల్లవిల్లి సత్యారావు, రాపర్తి సత్తిబాబు తదితరులు తెలిపారు. వేకువ జాము నుండే గ్రామంలో భజన బృందాలు, మహిళలు ,చిన్నారులతో సహా మేలు కొలుపులు కార్యక్రమంలో పాల్గని భజన పాటలను ఆలపిస్తూ గ్రామం పురవీధుల్లో దర్శన ఇస్తున్నారు .దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఎన్ఎస్ఆర్ఐటిలో జాతీయ యువజన దినోత్సవం

విశాలాంధ్ర – ఆనందపురం: శొంత్యాంలో గల నడింపల్లి సత్యనారాయణ రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అటానమస్ (ఎన్ఎస్ఆర్ఐటీ)లో దెనాలి పర్వతాలతో సహా పలు ప్రసిద్ధ పర్వతాల శిఖరాలను జయించిన విశిష్ట పర్వతారోహకుడు శ్రీ అన్మిష్ వర్మ స్ఫూర్తిదాయకమైన కీలకోపన్యాసం చేశారు. అతను ఆసియాలోని ఎవరెస్ట్ పర్వతాన్ని, ఐరోపాలోని ఎల్బ్రస్ పర్వతాన్ని, ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని దక్షిణ అమెరికాలోని అకాన్కాగువా పర్వతాన్ని అధిరోహించాడు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శంభు ప్రసాద్ విద్యార్థులతో తన అవగాహనలను పంచుకున్నందుకు అతిథికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ వర్మ ప్రయాణం నుండి స్ఫూర్తి పొందాలని వారి వారి రంగాలలో రాణించటానికి కృషి చేయాలని డాక్టర్ ప్రసాద్ విద్యార్థులను ప్రోత్సహించారు. సెంటర్ ఫర్ అకాడమిక్ ఎక్సెలెన్స్ హెడ్ అండ్ ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్. పి . ఎన్ . ఈ . నవీన్ , మెంబెర్ కృష్ణ మూర్తి, నేషనల్ సర్వీస్ స్కీం టీం హర గోపాల్, కాలేజ్ సెక్రెటరీ డాక్టర్. ఎస్ . ప్రసాద రాజు , ప్రిన్సిపల్ డాక్టర్. ఎస్.శంభూ ప్రసాద్ , డైరెక్టర్ డాక్టర్. జె . రాజా మురుగదాస్ లు అభినందించారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర – పరవాడ: పరవాడ మరిడిమాంబ ఫంక్షన్ హాల్లో లూయిస్ బ్రెయిలి 215వ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వైసిపి రాష్ట్ర రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ముందుగా బ్రెయిలి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వాన్ని జయించి అంధులందరికీ అక్షర జ్ఞానాన్ని ప్రసాదించి వారి జీవితాలలో వెలుగును నింపిన మహనీయుడు బ్రెయిలీ అని కొనియాడారు. బ్రెయిలీ లిపి నేర్చుకుని నేడు ఎంతోమంది ఆయా రంగాలలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. దివ్యాంగుల కొరకు ఎక్కడా లేని విధంగా అనేక పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయని అన్నారు. వికలాంగుల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం దివ్యాంగులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగులు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి, స్థానిక నాయకులు పైల అప్పలనాయుడు, బొద్దపు చిన్నారవు, కంచిపాటి భాస్కర్, సాధన ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

58వ వార్డులో పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర – మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 58వ వార్డు ఆదారి ఆనంద్ కుమార్ సొంత నిధులతో నిరుపేదలకు పంపిణీ చేయబడుతున్న పెన్షన్లను వార్డ్ అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులు సమక్షంలో పంపిణీ చేయడం జరిగింది. గురువారం ఈ సందర్భంగా వార్డు అధ్యక్షులు దాట్ల శ్రీనివాస రాజు మాట్లాడుతూ సేవా దృక్పథం కలిగిన మానవతావాది ఆనంద్ కుమార్ని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మన నియోజకవర్గం నుంచి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొందేసి చిన సత్యనారాయణ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, నక్క అప్పన్న, కోటా కృష్ణ, పెద్దాడ అప్పలరాజు, సుబ్బలక్ష్మి, గౌరమ్మ, డి.రామారావు, నక్క గోవిందా, టైలర్ గోవిందా, శ్రీరామ్ రెడ్డి పిలక వెంకటరత్నం చుక్క అది బాబు, కన్నబాబు,జగన్, చంద్రశేఖర్ రెడ్డి కార్యకర్తల తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కంబాల జోగులు విస్తృత పర్యటన

విశాలాంధ్ర – పాయకరావుపేట: రాజాం ఎమ్మెల్యే పాయకరావుపేట వైసిపి నియోజకవర్గ ఇన్ చార్జ్ కంబాల జోగులు మండలంలోని పలు గ్రామాల్లో విస్తృత పర్యటన చేస్తున్నారు. గురువారం పాయకరావుపేట మండలంలోని ఎస్. నరసాపురం, మాసాహెబ్ పేట గ్రామాల్లో పర్యటించి, నాయకులు, కార్యకర్తలు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్, వైసిపి మండల అధ్యక్షులు చిక్కాల రామారావు, ఇసరపు తాతారావు, పల్లెల వెంకట్, గెద్దమూరి శ్రీనివాసరావు, యజ్జల సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

40వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ

విశాలాంధ్ర – మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 40వ వార్డు జైఆంధ్రకాలనీ, రెల్లివీధి లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి లో పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని గెలిపించే బాధ్యత మనపై ఉందన్నారు జగన్ పాలనకు చరమగీతం పాడే రోజుల దగ్గరలో ఉన్నాయన్నారు ఈ కార్యక్రమంలో 63 వార్డు కార్పొరేటర్ చిన్న, వార్డు అధ్యక్షులు ఆర్ఆర్ రాజు , నానాజీ, పోక్కల కృష్ణ, మరియు నాయకులు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లిన వ్యాన్

విశాలాంధ్ర – జి.మాడుగుల: బోయితేలి పంచాయితీ వులుసు మామిడి గ్రామ సమీపంలో గురువారం ఉదయం అదుపుతప్పి లోయలోకి వ్యాన్ దూసుకెళ్లింది. వివరాల్లోకి వెళితే మైదాన ప్రాంతం నుండి మద్ది గరువు పరిసర ప్రాంతాలలో జియో టవర్ నిర్మాణ పనులు కోసం సామాగ్రిని వ్యాన్‌లో తరలిస్తుండగా వులుసు మామిడి గ్రామ సమీపంలో మలుపు వద్దకు వచ్చేసరికి వ్యాను అదుపుతప్పి లోయలోకి తీసుకెళ్లింది. వాహనంలో డ్రైవర్ క్లీనర్ మాత్రమే ఉన్నారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో వాహనం నుజ్జునుజ్జు అయింది.

గ్రామస్థులకు దోమ తెరలు పంపిణీ

విశాలాంధ్ర – జీకేవీధి: జీకేవీధి మండలం పెదవలస పంచాయతీ పెదలంక గ్రామంలో సర్పంచ్ పాంగి కృష్ణారావు ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సంస్థ ద్వారా దోమ తెరలు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ దోమ తెరలు వినియోగించుకోవాలన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జీకే విధి ఎస్సై అప్పలసూరి, రెడ్ క్రాస్ సంస్థ సూపర్ వైజర్ జయ, స్థానిక వార్డ్ మెంబర్, మహిళా పోలీస్, గ్రామ పెద్దలు అప్పారావు, బాలన్న, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర – జీకేవీధి: జీకేవీధి ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు గురువారం సికిల్ సెల్ అనీమియాపై వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పంచయతీ స్థాయిలో ఏఎన్ఎంలు, వలంటీర్లు, ఆశ వర్కర్లు, మహిళా పోలీసులు గ్రామస్థులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ర్యాపిడ్ టెస్ట్ చేయడం జరుగుతుందని, ఇందులో నిర్ధారణ అయితే పింఛన్లు ఇవ్వడం జరుగుతుందని, ఈ విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు హిమబిందు, అచ్యుత్, మణిదీప్, సిడిపిఒ, ఈఓపిఆర్‌డి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.